డ్రోన్ల ద్వారా భూ రక్ష-భూ సర్వే



రైతులకు డ్రోన్ ద్వారా భూ సర్వేపై అవగాహన కల్పిస్తున్న మండల సర్వేయర్ సోమశేఖర్

చెన్నూరు : వైఎస్సార్ జగనన్న భూ రక్ష భూ సర్వేని డ్రోన్ ద్వారా భూహద్దులను నిర్ణయిస్తామని మండల సర్వేయర్ సోమశేఖర్ అన్నారు. శనివారం మండలంలోని బయనపల్లి(కొండపేట), దౌలాతపురం గ్రామంలోని రైతులకు వైఎస్సార్ జగనన్న భూ రక్ష భూ సర్వేకు సంబంధించి అవగాహన కల్పించారు. కొండపేట, దౌలాతాపురం గ్రామాలకు సంబంధించి 4,750 ఎకరాలలో రీ సర్వే నిర్వహిస్తామన్నారు. ఇందులో రైతులు తమ భూములకు సంబంధించిన హద్దులను తమకు చూపిస్తే గ్రౌండ్ ట్రూయింగ్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తుంగ చంద్రశేఖర్‌యాదవ్, ఎంపీటీసీ దుంప నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్ట ప్రకారం నేరం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

వల్లూరు : బాల్య వివాహాలు చేయడం, ప్రోత్సహించడం చట్ట ప్రకారం నేరమని ఎస్ఐ పెద్దఓబన్న అన్నారు. వల్లూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం బాల్య వివాహాల వలన అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎవరైనా బాల్య వివాహాలను నిర్వహిస్తున్నట్లు తెలిస్తే వెంటనే సమాచారం అందించాలన్నారు. అనంతరం విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్ వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిలో రోగులను గుర్తించి సేవలు అందించాలి

జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్

కమలాపురం : ప్రతి గ్రామంలో ప్రతి ఇంటిని సందర్శించి అనారోగ్యంగా ఉన్న రోగులను గుర్తించి ఒక్క రుపాయి ఖర్చు లేకుండా నాణ్యమైన స్పెషలిస్ట్ వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ తెలిపారు. శనివారం మండలంలోని దేవరాజుపల్లెలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా చేస్తున్న కార్యక్రమాలను ఎంపీడీఓ, తహసీల్దార్, మెడికల్ ఆఫీసర్ జ్యోతి, సరస్వతి, ప్రసూనలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 45 రోజుల పాటు జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలసి ప్రతి ఇంటిని సందర్శించాలన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో మెడికల్ క్యాంప్‌లు నిర్వహించి ఉచితంగా పరీక్షలు చేసి మందులు పంపిణీ చేయాలన్నారు. శిబిరాల నిర్వహణకు ముందే మూడు రోజుల పాటు ప్రజలకు అవగాహన కల్పించి శిబిరాలకు వచ్చేలా చూడాలన్నారు. ఈ ప్రోగ్రామ్ 5 దశల్లో జరుగుతుందన్నారు. అధికారులంతా తప్పని సరిగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. మండల స్పెషలాఫీసర్ నరసింహారెడ్డి, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పులివెందులలో..

పులివెందుల రూరల్ : మండలంలోని తుమ్మలపల్లె సచివాలయ ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని శనివారం జేసీ గణేష్‌కుమార్ పరిశీలించి మాట్లాడారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. అలాగే ప్రతీరోజు గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ శిబిరానికి సుమారు 300 మంది ప్రజలు హాజరు కాగా 170 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ మాధవ కృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, అగ్రికల్చర్ ఏడీ అశోక్‌రెడ్డి, వైద్యులు విజయ్‌కుమార్, మనీశ్వని, లిఖిత, అఫ్రూన్, సిబ్బంది పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల : మండలంలోని పెద్దకుడాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జేసీ గణేష్‌కుమార్ పరిశీలించి మాట్లాడారు. పెద్దకుడాల, అక్కులుగారిపల్లె, తేర్నాంపల్లె, చిన్నకుడాల, దొండ్లవాగు, రామట్లపల్లె గ్రామాలకు చెందిన 323 మందికి చికిత్సలు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సురేంద్రనాథ్, తహసీల్దార్ లక్ష్మినారాయణ, ఎంఈఓ నారాయణరెడ్డి, హెచ్ఎం రామకృష్ణయ్య, మండల అధ్యక్షురాలు రమాదేవి, జడ్పీటీసీ పుష్ప, ఎంపీటీసీ గోవిందమ్మ, సర్పంచ్ శ్రీదేవి, మండల సచివాలయాల కన్వీనర్ నాగేంద్రనాథ్‌రెడ్డి, వైఎస్సార్సీపీ కడప పార్లమెంటరీ కన్వీనర్ జగన్‌మోహన్‌రెడ్డి, వైద్యులు వైద్యులు ఖాజామైనుద్దీన్, గంగాదేవి, సోమశేఖర్, సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : మండలంలోని కత్తులూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జడ్పీటీసీ ఎం.రవికుమార్‌రెడ్డి జేసీ గణేష్‌కుమార్, మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి, ఎంపీపీ లక్ష్మిగాయత్రిలతో కలసి ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లోనే సురక్ష క్యాంపులను నిర్వంచి, కావాల్సిన వైద్య సేవలు అందజేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మల్లికార్జునరెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి, వైద్యులు నిజాముద్దీన్, స్వాతిసాయి, సోఫియా, వెంకటేష్, వైద్య సిబ్బంది, సర్పంచ్ పావని, ఎంపీటీసీ కళ్యాణి, మాజీ సర్పంచ్ ప్రసాద్‌రెడ్డి, ఏపీఎస్ ఆర్టీ కోఆర్డినేటర్ శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



దేవరాజుపల్లెలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జేసీ గణేష్‌కుమార్



వేంపల్లె : కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి

వీఎన్‌పల్లెలో..

వీరపునాయునిపల్లె : మండలంలోని ఉరుటూరు 2 సచివాలయంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జేసీ గణేష్‌కుమార్ వైద్య బృందం ఏర్పాటు చేసిన కౌంటర్లను పరిశీలించడంతో పాటు ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం స్త్రీ శిశు సంక్షేమశాఖ వారు పౌష్టికాహారానికి సంబంధించి ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలించి సిబ్బందిని అభినందించారు. 198 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేసినట్లు మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఆర్డీఓ వెంకటేశ్వర్లు, రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, ప్రజా ప్రతినిధులు ఆయన వెంట ఉన్నారు.

వేములలో..

వేముల : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి అధ్యక్షతన శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగెళ్ల సాంబశివారెడ్డి, ఎంపీపీ చల్లా గంగాదేవి, జడ్పీటీసీ కె.వెంకట బయపురెడ్డి, పీసీబీ డైరెక్టర్ మరక శివకృష్ణారెడ్డిలు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం సీఎం జగన్ అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటసుబ్బయ్య, వైద్యాధికారిణి శరణ్య, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



వేములలో మాట్లాడుతున్న మండల ఇన్‌చార్జి నాగెళ్ల సాంబశివారెడ్డి

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : మైలవరం మండలంలోని బెస్తవేముల గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మండల ఎంపీపీ చేరెడ్డి సావిత్రి ప్రారంభించి మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వ పాలకులు పేద ప్రజలకు వైద్యం అందించడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. 276 మందిని వైద్యులు పరిక్షించి ఉచింగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ తిరుపతయ్య, ఎంపీడీఓ రామచంద్రారెడ్డి, వైద్యులు మేరిదీప్తి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ధన్నవాడ మహేశ్వరరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చక్రాయపేటలో

చక్రాయపేట : మారెళ్లమడక గ్రామ సచివాలయంలో శనివారం జగనన్న ఆ రోగ్య సురక్ష కార్యక్రమాన్ని జడ్పీటీసీ సభ్యుడు శివప్రసాదరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. మారెళ్లమడక, గండికొవ్వూరు గ్రామాలకు చెందిన 224 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మాధవీ బాలకృష్ణ, స్థానిక సర్పంచ్ నరసింహులు, ఎంపీటీసీ శాంతమ్మ, మండల జేసీఎస్ కన్వీనర్ రామాంజులరెడ్డి, ఎంపీడీవో శివారెడ్డి, డీటీ రామకృష్ణారెడ్డి, వైద్యులు శివప్రసాద్, వాణి, లావణ్య, కడప సర్వజన ఆస్పత్రి వైద్యులు సోఫియా, సౌజన్య, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు



చక్రాయపేటలో వృద్ధుడికి కళ్ల అద్దాలను అందజేస్తున్న జడ్పీటీసీ శివప్రసాదరెడ్డి

తొండూరులో..

తొండూరు : మండలంలోని బూచుపల్లెలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర శాప్ డైరెక్టర్, మండల వైఎస్సార్సీపీ అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. వైద్యులు 86 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జగనన్న ఆరోగ్య సురక్ష స్టేట్ డిప్యూటీ డైరెక్టర్ అనిల్‌కుమార్, జిల్లా నోడల్ ఆఫీసర్ అనిల్‌కుమార్, మండల స్పెషల్ ఆఫీసర్ తన్నన్న, తహసీల్దార్ బాల నరసింహులు, ఎంపీడీఓ విష్ణుప్రసాద్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కొండాపురంలో..

కొండాపురం : మండలంలోని చౌటిపల్లె పునరావాస కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎండిఓ శ్రీనివాసులరెడ్డి పరిశీలించారు. ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్యులు కిషోర్‌కుమార్, పి.శ్రావణ్, వి.సుజాత, పి.జయంతిలు 309 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : మండలంలోని వెల్లటూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అడిషనల్ డీఎంహెచ్ఓ ఉమామహేశ్వర్‌రావు ప్రారంభించి మాట్లాడారు. దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, వైద్యుడు రామప్రసాద్ పాల్గొన్నారు.



మైలవరం : మాట్లాడుతున్న ఎంపీపీ సావిత్రి



తొండూరులో అధికారులతో మాట్లాడుతున్న శాప్ డైరెక్టర్ రవీంద్రనాథరెడ్డి

ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు



జగనన్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆదేశాల మేరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం స్థానిక బయమ్మతోట సచివాలయ పరిధిలోని జెండామాను వీధి, శ్రీనివాస థియేటర్ వెనుక వైపు, పురుషోత్తంరెడ్డి కాలనీ, తదితర ప్రాంతాల్లో నిర్వహించారు. జగనన్న ప్రభుత్వంలో జరిగిన మేలును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఏవైనా సమస్యలుంటే తెలియజేయాలని కోరారు. మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్న వస్తే అన్నివర్గాల ప్రజలకు మరిన్ని పథకాలు అందిస్తారన్నారు.

కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ చిన్నప్ప, కమిషనర్ నరసింహారెడ్డి, వైస్ చైర్మన్ హఫీజ్, జేసీఎస్ ఇన్‌చార్జి చంద్రమౌళి, బలిజ సంఘం అధ్యక్షులు గూడూరు గురుప్రసాద్, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, బూత్ కమిటీ సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, మెప్మా సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చీనీ, అరటి పంటల పరిశీలన



చీనీతోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

లింగాల : లింగాల, సింహాద్రిపురం మండలంలోని చీనీ నర్సరీలను, అరటి తోటలను తిరుపతి వ్యవసాయ పరిశోధన కేంద్ర శాస్త్రవేత్తలు శనివారం పరిశీలించారు. సింహాద్రిపురం మండలంలోని అంకాలమ్మగూడూరు, సింహాద్రిపురం, బిదినంచెర్ల, గురిజాల, లింగాల మండలంలోని వెలిదండ్ల, లింగాల, వేముల మండలంలోని పెద్దజూటూరు గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లోని చీనీ నర్సరీలను, అరటి తోటలను వారు పరిశీలించారు. అరటి పరిశోధన శాస్త్రవేత్త సునీల్‌కుమార్ మాట్లాడుతూ అరటి పంటల్లో సిగటోగ తెగులు వ్యాపించే ప్రమాదం ఉందని రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. చీనీ పంటల శాస్త్రవేత్త రాజశేఖర్ మాట్లాడుతూ చీనీ పంటలలో చీనీ చెట్టు మొదలుకు బంకకారు వ్యాధి, చీనిచెట్లపై పేనుబంక వ్యాధులు ఉన్నాయని, వీటికి వెంటనే రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. స్టేట్ హార్టికల్చర్ బోర్డు మెంబర్ శివ ప్రసాద్‌రెడ్డి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటే లక్ష్యం



పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

చెన్నూరు : బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, విద్యకు మించిన ఆస్తి మరొకటి లేదని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. కనపర్తి గ్రామపంచాయతీ పరిధిలోని కైలాసగిరి యానాది ఎస్టీ కాలనీలో నూతన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన విద్యాశాఖ అధికారులతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ప్రతి గ్రామంలో గుడి బడి ఉన్నప్పుడే ఆ గ్రామం పురోగతి చెందుతుందని ప్రతి విద్యార్థికి అక్షర జ్ఞానం ముఖ్యమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నారన్నారు. అమ్మబడి, బడిలో చేరిన మొదటి రోజే విద్యార్థులకు బుక్స్, బ్యాగు, బెల్టు, అలాగే జగనన్న గోరుముద్ద ద్వారా మంచి పోషకలతో కూడిన మెనూ అమలు చేస్తున్నారన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవ రెడ్డి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామంలో విద్యార్థులకు అందుబాటులో పాఠశాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కైలాసగిరి కోనలో 23 మంది డ్రాప్ అవుట్స్ పిల్లలను గుర్తించామన్నారు. కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి, మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు చీర్ల సురేష్‌యాదవ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జి ఎస్ భాస్కర్‌రెడ్డి, నాయకులు పల్లె కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ ముదిరెడ్డి సుబ్బారెడ్డి, స్థానిక మండల విద్యాశాఖ అధికారి గంగిరెడ్డి, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మండల పూజ

వేముల: మండలంలోని వి.కొత్తపల్లెలో శనివారం నూతనంగా నిర్మించిన రామాలయంలో శ్రీ సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి విగ్రహాలను ప్రతిష్టించి 41 రోజు పూర్తి కావడంతో మండలపూజ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మండల ఇన్‌చార్జి నాగెళ్ల సాంబశివారెడ్డి, జడ్పీటీసీ కె.వెంకటబయపురెడ్డి, పీసీబీ డైరెక్టర్ మరక శివకృష్ణారెడ్డిలు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

రేపు సీబీఆర్‌పై సమీక్ష సమావేశం

లింగాల : కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సోమవారం సీబీఆర్‌పై మండల వైఎస్సార్‌సీపీ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పి.వి.సుబ్బారెడ్డి తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల నాయకులతో ఎంపీ సమస్యలపై చర్చించి వాటిని పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటారన్నారు.

స్వచ్ఛత సేవా కార్యక్రమంలో భాగస్వాములు కండి

పులివెందుల రూరల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన స్వచ్ఛత సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ రాకేష్ తెలిపారు. శనివారం రింగురోడ్డు సమీపంలో ఉన్న అకాడమిలో శిక్షణ పొందుతున్న ట్రైనర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వచ్ఛత సేవా కార్యక్రమంలో భాగంగా శిక్షణ తీసుకుంటున్న డ్రోన్, ఎలక్ట్రికల్ అభ్యర్థులకు పరిసరాల పరిశుభ్రత పైన అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో న్యాక్ ఇన్‌చార్జి చెన్నకేశవులు, ఏపీఎస్ ఎస్‌డీసీ కోఆర్డినేటర్ తరుణ్, జాబ్స్ కో ఆర్డినేటర్ దివాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

లింగాల : మండలంలోని ఇప్పట్ల గ్రామ సివార్లలోని జూదశాలపై శనివా రం దాడులు నిర్వహించి ఏడు మంది జూదరులను అరెస్ట్ చేసి వారినుంచి రూ.5,860 నగదును స్వాధీనం చేసుకు ని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సింహాద్రిపురం : రాయచోటి మాసాపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ క్రీడాకారులకు ఎంపికలు నిర్వహించారు. సింహాద్రిపురం ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు బాలురు, నలుగురు బాలికలు ఎంపికయ్యారు. అండర్-17 విభాగంలో రవీంద్రనాథ్‌రెడ్డి, మోక్షజ్ఞ ఎంపికయ్యారు. బాలికల విభాగంలో అక్షిత, శివగంగలు ఎంపికయ్యారు. అండర్-14విభాగంలో చరణ్ తేజ, మనోజ్ఞ, మహమ్మద్ ఆరిఫ్‌లు, బాలికల విభాగంలో గంగస్వప్న, మానసలు ఎంపికయ్యారు. ప్రధానోపాధ్యాయురాలు ఉమామహేశ్వరమ్మ విద్యార్థులను అభినందించారు. ఎంపికైన విద్యార్థులు ప్రకాశంజిల్లాలో అక్టోబర్‌లో రాష్ట్రస్థాయి జరిగే పోటీల్లో పాల్గొననున్నారు.

పెద్దముడియం : పెద్దపసుపుల గ్రామంలోని కస్తూర్బా పాఠశాలలోని అనుష్క, నాగదివ్య విద్యార్థినులు రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ ఎడ్యుకేషనల్ టీచర్ గంగాశిరీష తెలిపారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో జిల్లాస్థాయిలో జరిగిన పోటీలలో ఉత్తమ ప్రతిభ కనపరచడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆమె తెలిపారు.

రేపు విద్యుత్ నిలిపివేత

వేంపల్లె : మండలంలోని 33కెవి తాళ్ల ప ల్లె ఫీడర్ మరమ్మతుల కారణంగా తాళ్లపల్లె, గిడ్డంగివారిపల్లి, టి.వెలమవారిపల్లి గ్రామాల్లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ జేఈ చంద్రశేఖర్ తెలిపారు.

వినాయకుడి నిమజ్జనం

ఎర్రగుంట్ల : పట్టణంలోని నడివూరులో కొలుదీరిన వినాయకుడికి ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డిలు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమా న్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం వినాయకుడిని నిమజ్జనానికి తరలించారు.